# మరో చరిత్ర

అనార్కలి సినిమా చూశాక శేషుబాబుకి ధైర్యం పుంజుకుంది. గుండె బలం విపరీతంగా పెరిగినట్టయి ఛాతీ పొంగింది. బుద్ధిబలం కూడా ఎక్కువైనట్టుగా బరువెక్కిన హిప్పీ జుట్టువల్ల తోచింది.

చదువు పేరుతో స్వర్గంలాంటి పట్నంలో గంటలు నిమిషాల్లాగా గడిపాడు శేషుబాబు. రూపాయలు నీళ్ళలా ఖర్చుచేశాడు. ఆనందాన్ని అమృతంలా తాగేశాడు. అయినా అక్కడ అడిగేవాడు లేడు. పట్టించుకునేవాడు లేడు. అంచేత ఎంతలా కాలేజీ ఎగ్గొట్టినప్పటికీ, ఎంతలా కాలేజీ అమ్మాయిల్ని గోలచేసి 'డిబారు' సంపాయించినప్పటికీ, మరెంతలా స్ట్రయికులకి నాయకత్వం వహించినప్పటికీ, ఇంకెంతంతగా రాజకీయాల్లో మునిగి చదువు అశ్రద్ధ చేసినప్పటికీ... కాస్త టైము తీసుకుంటనే ఆలస్యంగానైనా శేషుబాబు మెళ్ళో డిగ్రీల పూలహారం పడకతప్పలేదు. అంతగా తలవంచని వీరుడిలా అనుభవాలు చవిచూసినప్పటికీ ఇప్పుడు ఆ పల్లెటూరిలో ఆ మురికిలో ఆ రొచ్చులో జీవితానికి తలొగ్గక తప్పేట్టూ లేదు.

పరీక్షలైపోతే ఆ దిక్కుమాలిన పల్లెటూళ్ళో ఎలా గడిపేదిరా భగవంతుడా అని విచారించాడిన్నాళ్ళూ. దిక్కుమాలిన పల్లెటూళ్ళే కావచ్చును, అందులోని ప్రజలూ దిక్కుమాలినవాళ్ళే కావచ్చును. కాని అతని తండ్రిని ఆ వూరికి మకుటంలేని మహారాజునీ, తద్వారా అతన్ని ఎదురులేని యువరాజునీ ఆ పల్లెటూరే చేసింది. మరందుచేత అతను వెళ్ళక తప్పదు.

శేషుబాబు ఇల్లు చేరగానే కొండలా ఎదిగిన కొడుకుని చూసుకుని అవతారం గారు ఎంతగా పొంగిపోయారో, అంతగానూ వూరి ప్రజలు కూడా సంతోషించారు.

అవతారంగారు ఆవూరు వచ్చేటప్పటికి అతనికేమీ లేదు. గోరంత చదివిన చదువు కొండంత కార్యాన్నీ, మరికొంత రాజకీయాన్నీ ఇవ్వగా ఒక

చేత్తో ఆస్తినీ, మరో చేత్తో మంచివాడన్న కీర్తినీ సంపాదించగలిగాడు. కాలు నిలదొక్కుకోవడానికి వూరివారి ఆస్తుల్నీ, శ్రమల్నీ, అజ్ఞానాన్నీ అమాయకత్వాన్నీ వాడుకున్నప్పటికీ అడిగినవాళ్ళకి లేదనని ధర్మదాతనీ, ఎప్పుడెవరు పిలిచినా వోయని పలికే ఆపద్బాంధవుడనీ పేరు తెచ్చుకున్నాడు. మరింత కష్టపడి ఆ వూళ్ళో తాను నెలకొల్పిన సింహాసనానికి, ఇంతగా చదువుకున్న తనకొడుకెంతగా పేరు ప్రతిష్టలు సమకూర్చి పెడతాడోనన్న తలంపువల్ల అవతారంగారు పొంగిపోయారు.

ఆ దిక్కుమాలిన పల్లెటూళ్ళో అదనుకి డబ్బులేక, ఎరువుల్లేక, విత్తనాలు లేక, పశువులులేక పేద రైతులు దిక్కుమాలినట్టుంటే వాళ్ళు. మిగతా ప్రపంచంతో సంబంధంలేక అంటరానట్టుండిపోయే వాళ్ళు. అయిదేళ్ళకోసారి ఆ వూళ్ళకి జీపులు వస్తే అవి పుష్పక విమానాలు తప్పించి మరొకటి అయ్యుండవనీ, అందులో వచ్చి ఓట్లు అడిగినవాళ్ళు దేవతా పురుషులు తప్ప మరొకరయ్యుండడానికి వీల్లేదని అనుకునే ఘోరమైన స్థితిలో ఉండిపోయేవాళ్ళు. "కాస్తంత సదూకోనీ... మందెగ్గిరొసూల్జేసిన సొమ్మేనయ్.... అయితేనేటి బేంకీ నాగా అదునికి సొమ్ములిచ్చి, గవర్నమెంటు నాగా టయానికి ఎరువులు సప్లయి జేసి మన బతుకుల్ని ఒక కొలిక్కి తెచ్చినాడు గాడా పెదబాబు? మరింత కన్నాఎక్కువే సదుకుండు సినబాబు.... మన వూరి రూపే మారిపోద్దిరా..." అనుకుని ఆ వూరి ప్రజలూ సంతోషించారు.

తనకొచ్చిన రెస్పాన్స్ చూసి తను ఏ పనిచేసినా చెల్లిపోతుందన్న ధీమా పుట్టింది శేషుబాబుకి. అంత ధీమా కలిగిన తరువాత దర్జాగా తలెత్తి చూస్తే మొట్టమొదటిసారిగా అతని కంట్లో పడింది అచ్చియ్యమ్మ.

అచ్చియ్యమ్మ అవతారంగారి పెద్ద పాలేరు పైడి రాజుకూతురు. రాజు కూతుర్లా డబ్బున్నదీ, సుకుమారమైనదీ కాకపోయినా అంతెత్తు మనిషి. ఎత్తైత్తు గుండెలూ, ఎంతెత్తో చెప్పలేని దాని అందమూ చూస్తే అజ్ఞాతవాసం చేస్తున్న ఏరాజు కూతురో అనుకోక తప్పదు. సినిమాల్లో విలన్ని నమ్మి శీలాన్నప్పజెప్పిన సైడ్ హీరోయినంత అమాయకురాలు కాకపోయినా

రాజకీయానికీ, మోసానికీ భేదాలూ సామ్యాలూ తెలియని అమాయకురాలే.

అందుచేత శేషుబాబు చెప్పిన మాటలు నమ్మింది. అతను చెప్పినవి మాటలు కావు. అనుభవమ్మిూదా, సినిమాలు చూసీ... నవల్లు చదివీ, సొంత సొంత తెలివితేటలు కలపీ తయారు చేసిన పంచదార గుళికలు!

"నీ అంత అందమైన బొమ్మనింత వరకూ చూడలేదు..." తో ప్రారంభించి.... "అవసరమైతే మా నాన్ననే కాదు ప్రపంచాన్నే ఎదిరిస్తాను" అంటూ ముగించిన ఆ కోర్సులో మధ్య మధ్య "ప్రేమా - పెళ్ళిళ్ళూ"... "జన్మజన్మల బంధం"లాంటి మినీ గుళికలు కూడా అచ్చియ్యమ్మ చేత తినిపించాడు శేషుబాబు.

మూడో కంటికి తెలియకుండానే జాగ్రత్తపడ్డాననే అనుకున్నాడు శేషుబాబు. కాని రసకందాయం ముదిరేసరికి మూడో కన్నేవిటి - ముప్పైకళ్ళల్లోపడ్డాడు

★ ★ ★

"సలీం..." అంటూ గంభీరంగా పిల్చాడు అక్బరు చక్రవర్తి.

నిండు దర్బారు. ఒక పక్కగా అనార్కలి తలవాల్చుకుని నిలుచుంది. అంతవరకు నాట్యం చేసి అలసిపోయినప్పటికీ సలీంఒళ్లో ఆమె కనురెప్పలు సోగగా వాలి ఉన్నాయి. దానికి కారణం ఏమిటని హూంకరిస్తే యువరాజు ప్రేమించడాన్న నిజం చెప్పినందుకేమో అనార్కలీ వెనకగా ఉన్నవాళ్ళంతా శత్రువుల్లా కనిపిస్తున్నారు అక్బరు చక్రవర్తికి. అంత వరకూ తన ప్రజలని తను పాలుపోసి పెంచితే వీళ్లు తననీ, తన కొడుకునీ, తన సామ్రాజ్యాన్నీ, తన అధికారాన్నీ కాటు వేయబోతున్నారనుకుని కుత కుత లాడిపోయాడు.

"సలీం..." అంటూ వాళ్ళమీది కోపంతో మరోసారి ఘీంకరించాడు అక్బరు చక్రవర్తి. "నేను విన్నది నిజమేనా?" అంటూ ఒక్కసారిగా గొంతు తగ్గించి నెమ్మదిగా అడిగాడు.

"చిత్తం... మీరు విన్నదంతా నిజమే... జహాపనా...." అన్నాడు సలీం వినయంగా.

కాదు అంటాడనుకున్నవాడు నిజమే అని అనేసరికి పిడుగుపడ్డట్టు గుండె గుభిల్లుమంది అక్బరు చక్రవర్తికి. అనార్కలీ కళ్ళల్లో వెలుగులు విరజిమ్మాయి. ఆమె వెనకనున్న ప్రజలంతా మెచ్చికోలుగా చూసిన చూపులు సలీంమీద పూలవాన కురిపించాయి.

"హూఁ" అంటూ గర్జిస్తూ తలవిదిలించాడు అక్బరు. "భావి భారత సామ్రాట్టువి. మొగలు వంశ యశోభూషణుడివి. న్యాయాన్యాయ విచాక్షణాదక్షుడివి. ఇట్టి అకృత్యానికి పాల్పడి నీకూ, నీ వంశానికీ, ఈ అఖిల రాజన్యలోకానికీ కళంకం తెచ్చిన నీకు విధించవసిని శిక్ష ఏమిటో తెలుసునా?" అంటూ సమాసాలు వల్లించడం వల్ల, ముఖంలో వచ్చిన ఎర్ర దనంవల్ల కాబోలు అతిక్రూరంగా కనిపించాడు అక్బరు చక్రవర్తి!

ప్రజలంతా ఆందోళనగా తండ్రీ కొడుకుల వైపు చూశారు.

"జీ హుజూర్.... ఏ శిక్ష విధించినా సంతోషంతో అనుభవిస్తాను. కాని జహాపనా.... నేను ప్రేమించిన పడతికి అన్యాయం చెయ్యలేను. ఆమె కోసం మీరు చెప్తున్న ఈ మొగలు సామ్రాజ్యాన్నే త్యజించడానికి సిద్ధంగా ఉన్నాను. ప్రేమించడమే మీ సామ్రాజ్యంలో నేరమైతే పౌరుడిగా బ్రతికేకన్నా ప్రేమికుడిగా చావునే స్వీకరిస్తాను." అని నిర్భయంగా చెప్పాడు సలీం.

సలీం గుండె ధైర్యానికి ప్రజలంతా మనసులోనే జోహార్లు అర్పించారు. అక్బరు చక్రవర్తి లాంటి గంభీరమూర్తి ముందు నోరు మెదపక అనార్కలీకి అన్యాయం చేస్తాడేమోనుకున్న సలీం ఆణిముత్యంలాంటి మాటలు పలకగానే ఆనందంతో చప్పట్లు కొట్టాలనిపించింది ప్రజానీకానికి.

"సరే...." అంటూ గంభీరంగా రెండుసార్లు చప్పట్లుకొట్లాడు అక్బరు చక్రవర్తి. భటులు వంగి వంగి ప్రణామం చేసి "ఏం సెలవు" అన్నట్టుగా నిబడ్డారు. "ఈ నేరస్థుణ్ణి మా ఏకాంత మందిరంలో ప్రవేశపెట్టండి" అంటూ చక చకా గద్దెదిగి వెళ్ళిపోయాడు అక్బరు చక్రవర్తి.

భటులు చక్రవర్తి అజ్ఞను పాటించారు.

మానేశారు. ఒక నెల్లాళ్ళపాటు పట్నాన్నే పగ్గంవేసి లాక్కొచ్చినంత హేపీగా గడిపాడు.

అయితే ఓరోజు తెల్లవారేసరికి వినవచ్చిన వార్తకి వూళ్ళోవాళ్ళంతా, శేషుబాబుతో సహా, నిశ్చేష్టులైపోయారు. నమ్మలేక వెళ్ళి చూసొచ్చారు. ఆ గది కిటికీ ముందు ఒక పెద్ద తీర్థంలా జన ప్రవాహం...

అంతమందికీ కిటికీలోనుండి కనిపించిన దృశ్యం - పైడిరాజు కూతురు అచ్చియ్యమ్మా, చిన్న పాలేరు నూకరాజూ, నలిగిపోయిన పక్కా, వాడిపోయిన పూలూ, గదికిపైన గొళ్ళెమూ, దానికో తాళం కప్పా!

వూరంతా ఛీ అని ఉమ్మేసింది. శేషుబాబు కుమిలిపోయాడు. తక్కువ స్పీడుతో అతి జాగ్రత్తగా నడుపుతున్న కారుకు అడ్డంగాపడితే, తప్పు అడ్డం పడినవాడిదే అయినప్పటికీ ఆ మనిషి మీదే సానుభూతి చూపించే తత్వం మనది. శేషుబాబు లాంటి నిజాయితీ పరుణ్ణి మోసం చేసిన పైడి రాజునీ, అచ్చియ్యమ్మనీ దుమ్మెత్తిపోశారు. ఇంతమంది ఇన్నివిధాలా ఛీ అన్న తరువాత ఏ నూతిలోనో ఏ చెరువులోనో పడి ప్రాణాలు తీసుకోకుండా ఉండడానికి వాళ్ళిద్దరూ రాళ్ళూరప్పలూ కారు.

★ ★ ★

అనార్కలీకి గోరీ కట్టించిన అక్బరు చక్రవర్తిని ఎవరూ తూలనాడలేదు. అంతగా ప్రేమించిన ప్రియురాలికి గోరీకట్టించేస్తుంటే, ఆమె తప్పుచేసి ఉండడానికి వీల్లేదని తెలిసిఉండీ అంతవరకూ నోరు మూసుకుని ఇప్పుడు బోరుమని ఆడదానిలా కన్నీరు పెడుతుంటే సలీంకే ప్రజలంతా సానుభూతి చూపించారు!

*(29-11-1978, ఆంధ్రప్రభ వారపత్రిక)*